## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- విద్యార్థులు కష్టపడి తమ జీవిత లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సూచించారు.
- ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు పలు ఐటీ సంస్థల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.
- దేశ నిర్మాణంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సిఎస్ఆర్ నిధులు ప్రధాన పాత్ర పోషిస్తునాయని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.

====================

రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో 16, 17వ స్నాతకోత్సవ వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై, విధ్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం ఆయన విద్యార్దులను ఉద్దేశించి మాట్లాడుతూ.. లక్ష్యం, కృషి, పట్టుదలే విజయానికి మార్గాలని అన్నారు. విద్యార్థులు కష్టపడి తమ జీవిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కేవలం జ్ఞాన సముపార్జన మాత్రమే కాకుండా విశ్లేషణాత్మకమైన స్వతంత్ర ఆలోచనా విధానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని గవర్నర్ దిశా నిర్దేశం చేస్తూ...

(వాయిస్...27 సెకన్లు)

====================

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తలెత్తిన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు, ఆయిల్ కంపెనీలకు సూచించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. గ్యాస్ సరఫరా ఇబ్బందులను అధిగమించడానికి ఆయిల్ కంపెనీలు పీఎన్జీ కనెక్షన్లను పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. వచ్చే 6 నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అమరావతిలోని సచివాలయంలో ఈరోజు జరిగింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి SIPB సిఫార్సుల మేరకు పలు ఐటీ సంస్థల ప్రతిపాదనలకు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. ఈ క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడించారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలలో AI డేటా సెంటర్ ప్రాజెక్ట్ సజావుగా అమలు జరగడానికి అదాని ఇన్‌ఫ్రా (ఇండియా) లిమిటెడ్, రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు సమర్పించిన అభ్యర్థనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయించడానికి సైతం ఆమోదం లభించిందని చెప్పారు. అదే విధంగా సత్యసాయి

జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ (ఓశాట్) సౌకర్యం స్థాపన కోసం RRP ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌కు 60 ఎకరాల భూమి కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకూ 9 లక్షల 36 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వివరిస్తూ..

(వాయిస్...32 సెకన్లు)

====================

దేశ నిర్మాణంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా మంజూరైన నిధులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన సౌత్ ఇండియా సిఎస్ఆర్ సమ్మిట్ ను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామాజిక భద్రత నిధి, చారిటీ కాదని ఒక బాధ్యత అని అన్నారు. వ్యాపారులు తమకు వచ్చిన లాభాల్లో కొంతభాగం సమాజ శ్రేయస్సుకు కేటాయించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. భారతీయ సనాతన సంప్రదాయాలు, విలువలను గౌరవిస్తూ నిధులను సమాజ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

====================

విరామం

====================

రామాయణపట్నం పోర్టు కాలపరిమితి పొడిగింపునకు కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం రెండో బ్లాక్ లో రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుపై మంత్రివర్గ ఉప సంఘ సమావేశం ఈరోజు జరిగింది. రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణ పనుల వేగ వంతం, మౌలిక సదుపాయాల మెరుగుదలపై సమావేశంలో మంత్రుల బృందం ప్రధానంగా చర్చించింది. పోర్టు తొలి దశ పనులను పూర్తి చేయడానికి కాల పరిమితి పొడిగింపునకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. పోర్టు నుంచి సరుకు రవాణా కోసం, అలాగే పోర్టుకు రైల్వే లేన్ అనుసంధానం కోసం భూసేకరణ, బడ్జెట్ అంశంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సబ్ కమిటీ సూచించింది.

====================

విజయనగరం జిల్లాలో 8వ విడత "పోషణ్ పఖ్వాడా" (పోషణ మాసోత్సవాలు) ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహిస్తామని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్న పిల్లల మేధో వికాసం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై సమాజంలో అవగాహన కల్పించడమే ఉత్సవాల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. అలాగే.. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో మాట్లాడుతూ, గర్భిణీలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

====================

హోమియోపతి వైద్యంతో ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా, దీర్ఘకాలికంగా వేధించే మొండి వ్యాధులను సైతం సమూలంగా నయం చేయవచ్చని శ్రీకాకుళం జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఉత్తమ్ రాజ్ రాణా పేర్కొన్నారు. శ్రీకాకుళంలో స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యాశాల, పొన్నాడ ఆసుపత్రుల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 16 ప్రభుత్వ హోమియో వైద్యశాలల ద్వారా మెరుగైన సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

====================

గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐటీడీఏ పనిచేస్తుందని పార్వతీపురం ఐటీడీఏ ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు.ఈరోజు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలోని గిరిమిత్ర హాల్‌లో నిర్వహించిన గిరిజన సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని గిరిజనుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

====================

ఒడిశా దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ఉత్తర-దక్షిణ ద్రోణి ఏర్పడిందని అమరావతిలోని వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్ర, యానాంలో.. ఈరోజు, రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

(వాయిస్…22 సెకన్లు)

=====================

ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మెన్ లంకా దినకర్ శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఈరోజు పర్యటించారు. కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ పథకాల అమలుపై జిల్లా అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రానికి సహకారం అందిస్తోందని అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు.

=====================

నేటి మహిళా నాయకులు దీర్ఘకాలిక ప్రభావంపై ఆధారపడిన సంస్థలను, వ్యవస్థలను తీర్చిదిద్దుతున్నారని CII - IWN ఛైర్ పర్సన్ ఉషా పంతుల తెలిపారు. ఈరోజు విజయవాడలో CII - IWN ఆంధ్రప్రదేశ్ 2025-26 వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పూర్వ CII ఛైర్మన్, southern region & Volvo group India MD కమల్ బాలి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "భారతదేశపు తదుపరి ఆర్థిక వ్యవస్థకు శక్తినిచ్చే మహిళా పారిశ్రామికవేత్తలు" అనే ఇతివృత్తంతో ఈ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ మహిళలను శక్తివంతం చేసేందుకు దోహదపడుతుందన్నారు. వికసిత భారత్ గా అభివృద్ధి చెందాలంటే మహిళల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించాలని ఆమె పేర్కొన్నారు.

=====================

=====================